ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 21 మే 2025

ఐసెట్‌లో 858 మంది ఉత్తీర్ణత

శ్రీకాకుళం, మే 20(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఆంధ్రా యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏపీ ఐసెట్-2025' ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జిల్లా నుంచి మొత్తం 980 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 394 మంది బాలురు, 487 మంది బాలికలు.. మొత్తం 881 మంది ఐసెట్ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 380 మంది బాలురు, 478 మంది బాలికలు మొత్తం 858 మంది ఉత్తీర్ణత సాధించారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



శ్రీకాకుళం ఫారెస్టు ఆఫీసు రోడ్డులో ఇలా..


మంగళవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)

శ్రీకాకుళం	58.25
పలాస	37.5
మందస	28.50
ఎచ్చెర్ల	29.25
రణస్థలం	18.8
పోలాకి	17.25
పొందూరు	13.0
ఆమదాలవలస	11.0
నందిగాం	10.5
పాతపట్నం	9.75
హిరమండలం	6.0
ఎల్.ఎన్.పేట	2.5
లావేరు	1.75
టెక్కలి	1.25

సిక్కోలు జలమయం

- జిల్లా అంతటా కుండపోత వర్షం
- పిడుగులతో భయాందోళన చెందిన ప్రజలు

శ్రీకాకుళం, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం కురిసిన వర్షం ప్రజలను భయం గొల్పింది. అంతటా వారాల పండగలు జరుగుతుండగా.. వేకువజాము నుంచి భారీ వర్షం కురవడం.. కాసేపు తెరిపివ్వడం.. మళ్లీ కుండపోతగా వర్షం కురిసింది. దీనికి తోడు మేఘం గర్జించి.. పలుచోట్ల పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళన చెందారు. శ్రీకాకుళంలో భారీ వర్షం కురవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్, రైతుబజార్ జంక్షన్ నుంచి బగ్గు సరోజినీదేవి ఆసుపత్రికి వెళ్లే రోడ్డు, డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి ఫారెస్ట్ ఆఫీస్ ముందు రోడ్డు.. నగరంలో ఇరుకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న గోడ వద్ద శ్రీకాకుళం నుంచి వెళ్తున్న కారు ఒకటి... కాలువలో సగం వరకు కూరుకుపోయింది. దీంతో గంటన్నర పాటుగా శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు ట్రాఫిక్ స్తంభించింది. పలాస, మందస, ఎచ్చెర్ల, రణస్థలంలో కూడా కుండపోత వర్షం కురిసింది.



ఒక్క విద్యార్థి.. పది మంది పర్యవేక్షణ

పొందూరు మే 20(ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి సప్లిమెంటరీలో భాగంగా మంగళవారం హిందీ పరీక్షకు పట్నాల రాజు అనే ఒక్క విద్యార్థి మాత్రమే హాజరయ్యాడు. ఈ కేంద్రంలో పరీక్షల పర్యవేక్షణకుగానూ పదిమంది ఉద్యోగులు విధులు నిర్వహించారు. వీరితోపాటు మంగళవారం డిప్యూటీ డీఈవో విజయకుమారి, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పరీక్షలను పర్యవేక్షించారు.

ఐఐటీ లక్ష్యంగా ముందుకు సాగుతా

- కంచరాన జ్యోషిత
- మంత్రి లోకేశ్ నుంచి పతకం స్వీకరణ

8లో



ఫీజుల మోత

- ప్రైవేటు పాఠశాలల్లో దోపిడీ
- పుస్తకాలు, యూనిఫాం పేరిట అధిక వసూలు
- ఒకటి నుంచి ఐదోతరగతి వరకు సొంత సిలబస్ అమలు
- విద్యార్థుల తల్లిదండ్రులపై తప్పని భారం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

- శ్రీకాకుళంలో ఒక కార్పొరేట్ పాఠశాలను ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడేందుకు మైదానం కూడా లేదు. కానీ ఫీజులు మోతతో విద్యార్థుల తల్లిదండ్రులు బోరు మంటున్నారు. ఒకటో తరగతికే ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, ఇతర ఫీజులతో రూ.34వేలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.
- నరసన్నపేటలోని ఒక ప్రైవేటు పాఠశాలను శనివారం మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఆ సమయంలో విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించి పుస్తకాలు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు రాష్ట్ర సిలబస్ కాకుండా, ఇతర సిలబస్ పుస్తకాలను విక్రయిస్తున్నట్టు గుర్తించి.. పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు.

నరసన్నపేట, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు చేపడుతున్నాయి. పరిమిత సీట్లు అంటూ బోర్డులు పెట్టి.. ఆర్భాటపు ప్రకటనలతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, క్రీడా మైదానాలు లేకపోయినా నిర్వాహకులు ఫీజుల మోత మోగిస్తున్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా అన్నింటికీ ఫీజులు పిండేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతోపాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. పుస్తకాలు, యూనిఫాం, షూ కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేసేలా నిబంధన విధిస్తున్నారు. వాటి పేరిట మరి కొంత (మిగతా 6వ పేజీలో..)

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- మైనింగ్‌పై రెగ్యులర్ తనిఖీలు చేపట్టాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 20(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ-కోసం' కార్యక్రమంలో ఇప్పటివరకు 61,048 ప్రజా ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో 343ఫిర్యాదులు గడువు దాటిపోయాయి. సమస్యల పరిష్కారంలో అలస్యానికి తావులేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఎన్‌ఆర్‌ఈజీఎస్, రెవెన్యూ, ఆరోగ్యం, మైనింగ్, పీఎం సూర్యఘర్, రీసర్వే, కోర్టు కేసులు, అంతర్జాతీయ యోగా దినోత్సవం తదితర విషయాలపై మండల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేయాలని, సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన పనులను డ్వామా అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. 22(ఏ) రికార్డుల స్వచ్ఛీకరణ, వివిధ శాఖలతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల స్థితిగతులు, వంశధార నదిపై హై లెవెల్‌బ్రిడ్జి, నువ్వలరేవు- మంచినీళ్లపేట రహదారి నిర్మాణాలకు సంబంధించిన అడ్డంకులపై చర్చించారు. నువ్వలరేవు ప్రజలు ఎక్కువ పరిహారం కోరుతున్నారని.. పలాస ఆర్డీవో, వజ్రపుకొత్తూరు తహసీల్దారు, శ్రీకాకుళం ఎస్ఈ సంయుక్త సమావేశం నిర్వహించాలని తెలిపారు. లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో యూనివర్శిటీ స్థాపనకు 30-40 ఎకరాలు, హైడ్రోకార్బన్ కంపెనీ స్థాపనకు 2వేల ఎకరాలను గుర్తించాలని, ఏపీఐఐసీ భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

- మైనింగ్‌పై ఆగ్రహం

ఇసుక అక్రమ రవాణా, నియంత్రణలేని గ్రానైట్ తవ్వకాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. డివిజనల్, జిల్లామైనింగ్ కార్యాలయాల మధ్య సమన్వయం బలోపేతం చేయాలన్నారు. గ్రానైట్‌క్వారీల్లో రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే ఆరోగ్యం, శానిటేషన్, వ్యాధుల నివారణ, నీటి నమూనాల పరిశీలనపై వైద్యశాఖను ఆదేశించారు. సూర్యఘర్ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద ఉన్న పెండింగ్‌లను క్లియర్ చేయాలని, ఐసీడీఎస్ పథకంలో నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జూన్ 21న యోగా దినోత్సవానికి ఆయుష్ శాఖ, అరసవల్లి ఎండోమెంట్ అధికారి సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమీక్షలో ఉపకలెక్టర్ పద్మావతి, డీఆర్వో వేంకటేశ్వరరావు, డీపీవో భారతీ సౌజన్య, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

వేడుకగా మినీ మహానాడు

8లో

కార్యకర్తలకు టీడీపీలో సముచిత స్థానం

7లో



ఇచ్ఛాపురం : మినీ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు


'మాటామంతి'కి రావివలస ఎంపిక

- రేపు వర్చువల్ విధానంలో గ్రామస్థులతో మాట్లాడనున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

టెక్కలి, మే 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గంలోని రావివలస గ్రామాన్ని మాటామంతి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో ఈ గ్రామంతోపాటు ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయనుంది. 'మాటామంతి'లో భాగంగా ఈ నెల 22న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్ విధానంలో గ్రామస్థులతో మాట్లాడనున్నారు. ఈ మేరకు మంగళవారం టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి గ్రామస్థులతో సమావేశమయ్యారు. మాటామంతి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీబాయ్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సీఈవో సుధాకర్, టీడీపీ నాయకులు బగాది శేషు, ఎల్ఎల్ నాయుడు, బడే జగదీష్, ఇప్పిలి జగదీష్, హెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



దొరబాబు (ఫైల్)

అమ్మవారి పండుగకు వెళ్లి తిరిగి వస్తూ..

- డివైడర్‌ను ఢీకొని ఆర్మీ జవాన్ మృతి

8లో

పండుగ వేళ.. పిడుగు

- నాగావళి తీరంలో దుర్ఘటన
- తండ్రి మృతి .. కుమారుడికి తీవ్ర గాయాలు
- బూబమ్మనగర్‌లో విషాదం

శ్రీకాకుళం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత సంబరాలతో అప్పటి వరకూ ఆ ఇళ్లంతా కళకళలాడింది. కుటుంబ సభ్యులు, బంధువులతో సందడిగా కనిపించింది. అటువంటి పండుగ వేళ.. ఆ ఇంట ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. అమ్మవారికి మొక్కులు చెల్లించి.. నాగావళి నది తీరాన మేకపోతు పొట్టు మాంసాన్ని శుభ్రం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడింది. ఈ ఘటనలో తండ్రి అక్కడక్కడే మృతి చెందగా.. కుమారుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులతో రోదనతో అంతటా విషాదం అలుముకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శ్రీకాకుళం నగరం బలగమెట్టు సమీపాన బూబమ్మనగర్‌కు చెందిన గేదెల రాజారావు (55) మంగళవారం ఉదయం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఆయన కుమారుడు నాగార్జున కూడా పిడుగు శబ్దంతో ఉలిక్కిపడి అస్వస్థతకు గురయ్యాడు. బలగమెట్టు, బూబమ్మనగర్ ప్రాంతంలో భద్రమ్మతల్లి అమ్మవారి వారాలు మంగళవారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాజారావు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి అమ్మవారికి పసుపు కుంకుమ చెల్లించి.. మేకపోతును బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం బలగ మెట్టు ప్రాంతంలో ఉన్న నాగావళి ఒడ్డుకు తండ్రీ కొడుకులు చేరుకున్నారు. అక్కడ మేకపోతు పొట్టు మాంసాన్ని శుభ్రం చేస్తుండగా ఒక్కసారి ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. దీంతో రాజారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు నాగార్జునకు తీవ్ర గాయాలు కాగా.. అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి(రిమ్స్)కు నాగార్జునను తరలించారు. ప్రస్తుతం ఎఫ్ఐసీయూలో ఆయనకు వైద్యులు చికిత్స చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ ఎస్ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

- గేదెల రాజారావు తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.



మృతుడు గేదెల రాజారావు (ఫైల్)

అంతవరకూ భద్రమ్మతల్లి సంబరాల్లో అందరితోనూ సరదాగా ఉన్న రాజారావు పిడుగుపాటుకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుమారుడు కూడా ఆస్పత్రి పాలవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. స్థానికులు విషాదంలో మునిగిపోయారు. రాజారావు మృతిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాగార్జునకు మెరుగైన చికిత్స అందజేయాలని వైద్యాధికారులను మంత్రి అచ్చెన్న ఫోన్‌లో ఆదేశించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రానున్న మూడు రోజులు పిడుగులు, ఉరుములతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్న సూచించారు.



పిడుగుపాటుతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగార్జున

ఐటీఐతో ఉపాధికి భరోసా

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు గడువు 24
- జిల్లాలో 3 ప్రభుత్వ, 20 ప్రైవేటు ఐటీఐలు
- కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

ఎచ్చెర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధికి భరోసా ఇచ్చే కోర్సుల్లో ఐటీఐ ఒకటిగా చెప్పవచ్చు. ఐటీఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)లో చేరితే తక్కువ సమయంలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొంద వచ్చు. పాలిటెక్నిక్ డిప్లమో, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటీఐకి ఏమాత్రం డిమాండ్ తగ్గలేదు. ఐటీఐ పూర్తిచేసిన వారికి పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి అవకాశాలు ఉండడంతో ఈ కోర్సు పట్ల ఆసక్తి చూపేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఐటీఐ పూర్తయిన తర్వాత నేరుగా పాలిటెక్నిక్ డిప్లమో రెండో సంవత్సరంలో చేరే అవకాశం కూడా ఉంది. ఐటీఐ పాసైతే వివిధ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఈ కారణంగా ఐటీఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.



ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐ

పెరిగిన డిమాండ్..

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఐటీఐలో ప్రవేశమే చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారు సైతం ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు ఇష్టపడేవారు. ఈ జిల్లాకు చెందిన వారికి అప్పట్లో శ్రీకాకుళం డీఎల్‌టీసీలో సీటు లభించలేదంటే బొబ్బిలి, విశాఖ పట్నం వంటి సుదూర ప్రాంతాలకు కూడా వెళ్లి ఐటీఐ కోర్సులో చేరేందుకు ప్రయత్నించేవారు. సుమారు పది, పదిహేను ఏళ్ల నుంచి ఐటీఐ కోర్సులకు డిమాండ్ పూర్తిగా తగ్గింది. ఆ తర్వాత క్రమేణా పూర్వవైభవం సంతరించు కుంది. పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత ఐటీఐ కోర్సు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం గ్యారెంటీ కావడంతో యువత ఇటు వైపుగా ముందుకు సాగుతున్నారు. దీంతో ఐటీఐ కోర్సులకు మళ్లీ డిమాండ్ ఏర్పడింది. ఐటీఐ చదివిన వారికి రైల్వే, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఆర్టీసీ, స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, కెమికల్ పరిశ్రమలు, డిఫెన్స్, ఆర్టీసీ తదితర శాఖల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి.

ఈ ఏడాది ప్రవేశానికి..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశం కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 24వ తేదీలోగా ఐటీఐ డాట్ ఏపీ జీవీవీ డాట్ ఇన్ వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు డౌన్ లోడ్ చేసుకున్న అప్లికేషన్‌ను, ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో మే 24వ తేదీలోగా వెరిఫికేష న్ చేయించుకుంటేనే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అర్హులవుతా రు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను తయారుచేసి, రిజర్వేషన్ ప్రాప్తికి సీట్లను భర్తీ చేస్తారు.

జిల్లాలో ఐటీఐల వివరాలు..

ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాసలో ప్రభుత్వ ఐటీఐలు, 20 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. వీటిలో కోర్సులు ఇలా..



ఫిట్టర్..

ఐటీఐ కోర్సుల్లో ఫిట్టర్ ఎవర్ గ్రీన్ కోర్సు. ఇది రెండేళ్ల కోర్సు. ఇతర కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నా..దీనిలో మాత్రం సీట్లు నిండిపోతాయి. ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉన్న కోర్సు ఇది. కౌన్సెలింగ్‌లో తొలి ఆప్షన్‌గా ఈ కోర్సునే ఎంచుకుంటారు.

ఎలక్ట్రికల్..

ఈ కోర్సు కాల పరిమితి రెండేళ్లు. ఎలక్ట్రికల్ విభాగం తో సంబంధం ఉన్న కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశముంది. అలాగే ప్రైవేటు సెక్టార్‌లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు చాలా మంది ఐదేళ్ల కిందట కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ఎలక్ట్రీషియన్లుగా ఎంపికయ్యారు.

డ్రాఫ్ట్‌మెన్ సివిల్..

ఈ కోర్సు కాల పరిమితి రెండేళ్లు. నిర్మాణ రంగంలో వీరికి అవకాశాలు ఎక్కువ. వివిధ ప్రభుత్వ శాఖల్లో కూడా ఉద్యోగాలు పొందే అవకాశముంది. డ్రాఫ్ట్‌మేన్ సివిల్ కోర్సు పూర్తిచేసిన వారు ప్రస్తుతం వివిధ కార్పొరేషన్లలో ఏఈలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మోటార్ మెకానిక్..

ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. మోటార్ రంగంలో స్థిరపడేందుకు అవకాశముంటుంది. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. మోటారు రంగానికి రోజు రోజుకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్వయం ఉపాధి దిశగా ఈ రంగాన్ని ఎంచుకొని అద్భుతాలు సృష్టించిన వారు ఉన్నారు.

ఇన్‌స్ట్రుమెంట్..

ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. ఇది పూర్తయితే పరిశ్రమల్లో ఆటోమెషిన్‌ల వద్ద ఉద్యోగాలు కల్పిస్తారు. ఈ కోర్సుకు డిమాండ్ బాగానే ఉంది.

డీజిల్ మెకానిక్..

డీజిల్‌తో సంబంధమున్న అన్ని విభాగాల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజీల్లో ఉద్యోగం పొందేఅవకాశం ఎక్కువ. ఈ కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే.

కంప్యూటర్స్..

ఈ కోర్సు కాలపరిమితి ఏడాది. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులు. ఏ రంగంలో రాణించాలన్నా కంప్యూ టర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్‌లో ఉద్యోగాలు పొందేందుకు వీలుంది.

కటింగ్ అండ్ టైలరింగ్..

ఈ కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే. మహిళల కు సంబంధించిన కోర్సు ఇది. కటింగ్, టైలరింగ్‌కు సంబంధించి తర్ఫీదు ఇస్తారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో ఈ కోర్సు ఉంది.

ఎలక్ట్రానిక్ మెకానిక్..

ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు టీవీలు, సెల్‌ఫోన్‌లు రిపేర్ చేయడంలో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులో ప్రావీ ణ్యం పొందితే సొంతంగా తమ కాళ్లపై నిలబడడటమే కాకుండా మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

వెల్డర్..

ఈ కోర్సు పూర్తిచేసిన వారికి పరిశ్రమల్లో ఉద్యోగావకా శాలు ఉన్నాయి. ఏడాది కోర్సు ఇది. వెల్డర్ కోర్సు చదివిన వారు అరబ్ దేశాల్లో ఉద్యోగాలు పొందే వీలుంది.

బ్రిడ్జి కోర్సుతో పాలిటెక్నిక్..

ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పై చదువులు కొనసాగించవచ్చు. బ్రిడ్జి కోర్సు పూర్తిచేసిన తర్వాత ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.

స్కాలర్‌షిప్ సౌకర్యం..

ఐటీఐలో ప్రవేశం పొందే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కు స్కాలర్‌షిప్ సౌకర్యం పొందే వీలుంది. రెండేళ్లు, ఏడాది కాలపరిమితితో కూడిన ఐటీఐ కోర్సుల్లో ఉచితం గా ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.

మార్కులే ప్రాతిపదిక..



పదో తరగతిలో వచ్చిన మార్కు ల ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్ట్ ప్రాప్తికి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. ఐటీఐ కోర్సులు చదివిన అభ్యర్థులకు ఉపాధి గ్యారం టీగా లభిస్తుంది. ఐటీఐ చదివిన వారికి పరిశ్రమల్లో ప్రాధాన్యం ఉంటుంది. విదేశాల్లో కూడా ఐటీఐ అభ్యర్థులకు డిమాండ్ ఉంది. పరిశ్రమలకు అనుగుణంగా ఐటీఐల్లో శిక్షణ ఇస్తుండడంతో నాణ్యమైన సంస్థలు, పెద్ద పెద్ద కంపెనీలు కూడా ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకా శాలు కల్పిస్తున్నాయి. శిక్షణానంతరం అప్రంటిస్ మేళాలు, మెగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తు న్నాం. అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలను తర్వాత ప్రకటిస్తాం.

-సుధాకరరావు, జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఎచ్చెర్ల

ఫీజుల మోత

(ఐదో పేజీ తరువాయి)

దోచేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలను రూ.10వేల నుంచి రూ.12వేలకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వం నిర్ధారించే ఫీజులు ఇలా..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటోతరగ తి నుండి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, మండల కేంద్రాల్లో ఉ న్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4-5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12వేలు, ఆరో తరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9వేలు, మండల కేంద్రాల్లో 9,500, పట్టణాల్లో రూ.11,100 పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు.

అమలు కాని నిబంధనలు..

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారుల తో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమిం చింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరి శీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాల ను పరిగణలోకి తీసుకుని గ్రామాలు,పట్టణా ల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజిం చారు. మొత్తం 474 స్కూళ్లకు ర్యాంకింగ్‌లు ఇ చ్చారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 10 వ తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఫీజు వసూలు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసుబోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్ర భుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పు స్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయిస్తూ.. వాటినే బోధిస్తున్నారు. ఆరోతరగ తి నుంచి తొమ్మిదోత రగతి వరకు ఇంటర్‌స్థా యిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- నత్తనడకన అమృత్‌భారత్ పనులు
- ఆవేదనలో ప్రయాణికులు

కాశీబుగ్గ, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కేంద్రం తరువాత ముఖ్యమైన పట్టణం పలాస. కానీ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది ఇక్కడి రైల్వేస్టేషన్ పరిస్థితి. వ్యాపార, వాణిజ్యానికి పలాస పెట్టింది పేరు. కానీ ఎందుకో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. ఇక్కడి రైల్వేస్టేషన్‌కు సమస్యలు వీడడం లేదు. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడడం లేదు. అటు ప్రధాన రైళ్ల నిలుపుదల లేదు. దీంతో సుదూర ప్రాంతం వెళ్లాల్సిన వారు 100 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాకుళం, బరంపురం వెళ్లి రైళ్లు ఎక్కాల్సి వస్తోంది. రైల్వేశాఖ అమృత్ భారత్ పథకంలో 2023లో పలాస స్టేషన్ అభివృద్ధికి నిర్ణయించింది. ఇందుకుగాను రూ.23.85 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకంలో భాగంగా జిల్లాలో శ్రీకాకుళం రోడ్డు, పలాస, నౌపడతో పాటు ఇచ్ఛాపురం స్టేషన్‌ను ఎంపిక చేశారు. కానీ ఏళ్లు గడుస్తున్నా పలాస రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఇక రైళ్ల నిలుపుదల విషయంలో స్పష్టత రాలేదు.


స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

కానరాని పురోగతి..

పలాస రైల్వేస్టేషన్ మీదుగా రోజుకు సగటున 75 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని అంచనా. ఒడిశాలోని గజపతి, మన జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గ ప్రజలు ఈ రైల్వేస్టేషన్‌పై ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఇటీవల వరకూ ఈస్టుకోస్టు రైల్వే జోన్‌లో ఉన్న పలాస స్టేషన్ విశాఖ రైల్వేజోన్‌లో చేరింది. రెండేళ్ల కిందట అమృత్ భారత్‌లోలో భాగంగా పలాస స్టేషన్ అభివృద్ధికి రూ.23.85 కోట్లు మంజూరు చేసింది రైల్వేశాఖ. కానీ పనుల్లో ఎందుకో జాప్యం జరుగుతోంది. ఇక్కడ ప్రయాణికులకు తగ్గట్టు వసతులు లేవు. వారి అవసరం మేరకు కీలక రైళ్లకు హాల్టింగులు లేవు. నీడనిచ్చేందుకు వీలుగా ప్లాట్‌ఫారంపై నిర్మాణాలు చేపట్టాలి. మరుగుదొడ్లు, ప్రయాణికుల వాహనాలు పార్కింగ్ చేసే విధంగా స్థలాల అభివృద్ధి, సాధారణ, ప్రత్యేక తరగతుల ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ గదులు వంటి వాటి నిర్మాణం చేపట్టాలి. ఈ ప్రాంతంలో వలస కూలీలు అధికం. ఆపై వ్యాపారులు కూడా ఉంటారు. వీరికి రైల్వేసేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.


పలాస రైల్వే స్టేషన్

బాధాకరం..



పలాస రైల్వేస్టేషన్ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. ఇది బాధాకరం. అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసి నందుకు చాలా సంతోషించాం. కానీ పనుల తీరు చూస్తుంటే బాధేస్తోంది. వేలాది మంది ప్రయాణికులు ఈ స్టేష న్ గుండా రాకపోకలు సాగి స్తుంటారు. కానీ వారికి తగ్గ వసతులు కల్పించ డంలో రైల్వే శాఖ విఫల మైంది.

-చాపర వేణుగోపాల్, సీపీఐ కార్యదర్శి

ప్రధాన రైళ్లు నిలపాలి..



జిల్లా కేంద్రం తరువాత అతి పెద్దది పలాస. ఇక్కడ వర్తక, వాణిజ్యం అధికం. ఒడి శా ప్రజలు సైతం ఈ స్టేషన్ గుండా రాకపోకలు సాగి స్తుంటారు. కానీ ప్రధాన రైళ్లకు హాల్టింగ్ లేదు. వీక్లీ, ప్రత్యేక రైళ్లు ఆగకుండా వెళ్లిపోతుంటాయి. ఉన్న కొద్దిపాటి రైలు సర్వీసులు రద్దవుతుంటాయి. ఎప్పుడు తిరుగు తాయో.. ఎప్పుడు తిరగవో అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఇప్పటికైనా రైల్వేశాఖ దృష్టిపెట్టాలి.

-సీహెచ్ రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, పలాస

ఘనంగా చింతామణి సంబరం

- ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

కవిటి, మే 20 (ఆంధ్రజ్యోతి): కవిటి చింతామణి అమ్మవారి సంబరాన్ని ప్రగడపుట్టుగ గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఘటాలతో ఊరేగించారు. కాళీకామాత వేషధారణ, గజముద్దలు, కోలాటం, గరిడీ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అర్జునాపురంలో...

కంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్జునాపురం గ్రామంలో చింతామణి అమ్మ వారి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమపూజలు, అన్నసమారాధన కార్యక్రమాలలో భక్తులు పా ల్గొన్నారు. ఘటాలు, గజముద్దలు, కాళికా వేషాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.


కవిటి: అమ్మవారి గజముద్దలు, కాళికతో భక్తులు

ఉత్సాహంగా బాడీబిల్డింగ్ పోటీలు

- ఆకట్టుకున్న దివ్యాంగుడి ప్రదర్శన


పోటీలో పాల్గొన్న బాడీబిల్డర్లు


దివ్యాంగుడు అనిల్ కుమార్

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జోనల్ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను ఉత్సాహభరిత వాతావరణం లో నిర్వహించారు. స్టార్ బాడీ బిల్డర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఆరు జిల్లాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. వివిధ కేటగిరిలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళానికి చెందిన దివ్యాంగుడు తుపాకుల అనిల్ కుమార్ ప్రదర్శన అందరినీ ఆకట్టు కుంది. పోటీలకు కోసం కఠోర సాధన చేసిన అనిల్‌ను అందరూ అభినందించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాస్టర్లు ఆయనకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్టార్ బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి, ఆర్గనైజర్ వి.విజయ్‌కుమార్, అప్పన్న, ఆంధ్ర బాడీ బిల్డ ర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, అధ్యక్షులు స్వామి రేమస్ కుమార్, జిల్లా కార్యదర్శి కె.గౌరీశంకర్, చీఫ్ ప్యాట్రన్ బి.దేవభూషణ్, బలగ ప్రసాద్, బి.సూ రిబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మురిపించిన హరివిల్లు

ఎల్.ఎన్.పేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం వర్షం కురిసింది. ఉదయం 7 నుంచి సుమారు 10 గంటల వరకు ఉరుములు, మెరుపులతో హడ లెత్తించింది. ఆ సమయంలో పడమర వైపు మేఘాలలో ఇంద్ర ధనుస్సు కను విందు చేసింది. ఈ దృశ్యాన్ని యువకులు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి... మురిసిపోయారు.

-ఎల్.ఎన్.పేట, మే 20 (ఆంధ్రజ్యోతి)

ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి

● కలెక్టరేట్ వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల నిరసన



నిరసన్న తెలుపుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

శ్రీకాకుళం, మే 20(ఆంధ్రజ్యోతి): చట్టప్రకారం వీక్లీఆఫ్, జాతీయ సెలవులు అమలుచేయాలని, విధి నిర్వహణలో భాగంగా ఇచ్చిన సెల్‌ఫోన్ల రీచార్జీ ఖర్చులు ఇవ్వాలని, ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ యూనియన్ డ్రైవర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, దశరథ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని సమ్మెలో భాగంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అరబిందోయాజమాన్యం పదేళ్లుగా తక్కువ వేతనం ఇస్తోందని, ఆ వేతనంతో పెరిగిన నిత్యావసర ధరలతో జీవనం సాగించడం దుర్భరంగాఉందని తెలిపారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ప్రకాశరావు, కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడుఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి పాల్గొన్నారు.

వీఆర్ఏలకు పదోన్నతులు ఇవ్వాలి



మాట్లాడుతున్న అప్పలస్వామి

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 20(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు ఇంటర్ అర్హతతో పదోన్నతులు కల్పించాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.అప్పలస్వామి కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని రెవెన్యూ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికగా అర్హులైన వీఆర్ఏలకు సీపీటీ వెసులుబాటు కల్పించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లేష్, ఉదయకిరణ్, సుధీర్, భూలోక, దుర్గారావు, పార్వతి, సౌజన్య, ప్రసాద్, ఎరకమ్మ, ఉదయ్‌కుమార్, రమణమ్మ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ శిక్షణ

ఆమదాలవలస, మే 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దన్నానపేట వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ మూడు నెలలపాటు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7569077449 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఈనాం భూములకు పథకాలు వర్తింపజేయాలి

సరుబుజ్జిలి, మే20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రొట్టవలసలోని ఈనాం భూముల రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు తొత్తడి సత్యనారాయణ, తాడేల వెంకటరమణ, లావేటి పూర్ణారావు, మూడడ్ల గోవిందరావుతోపాటు పలువురు రైతులు కోరారు. ఈమేరకు షలంత్రిలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణకువినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రొట్టవలస రైతుల సమస్యలను ఆయన కు వివరించారు.రొట్టవలసలో రెండు శతాబ్దాల నుంచి ఈనాం భూములను 400 మందిరైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యంలో వైసీపీ హయాం నుంచి అడంగళ్లను నిలిపివేశారని పేర్కొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



స్కానింగ్‌సెంటర్‌లో తనిఖీ చేస్తున్న రాందాస్

శ్రీకాకుళం రిమ్స్, మే 20(ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో రోగుల వివరాల నమోదు తప్పనిసరి అని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆర్.రాందాస్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని రఫా, సాధన స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వివరాల నమోదు చేయని స్కాన్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో వేంకటేశ్వరరావు, స్వరూప్ పాల్గొన్నారు.

మురుగు కాలువ సమస్య పరిష్కరించాలి

సోంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): పలాసపురం పంచాయతీలోని పెంట వీధి మురుగుకాలువ సమస్య పరిష్కరించాలని గార సంతోష్, బి.సుజాత, ఆరింగి వరాహమూర్తి, ఆరింగి శ్రీనివాసులు, దున్న కూర్మారావు తదితరులు కోరారు.ఈమేరకు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షంకురిస్తే పెంటివీధిలో కాలువ పూర్తిగా నిండిపోయి రోడ్డుపైకి మురుగు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు ప్రోత్సాహం

ఆమదాలవలస,మే 20(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహిస్తున్నట్లు సీడీఎఫ్ సురేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా చేపేనపేట యూనిట్ కొరపాంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానించారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రాజశేఖర్, నాగభూషణ్, కల్పన, రైతు రమణమూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం, మే20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో సినీహీరో ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలను పట్టణ ఫ్యాన్స్ ప్రతినిధులు కాళ్ల జయదేవ్, జన్నెల సంతోష్,వినయ్, కేదారిపురం ఎన్‌టీఆర్ అభిమానులు మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

మాతృభాషతోనే సృజనాత్మకత

గుజరాతీపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మాతృభాషలోనే చదివితే పిల్లలు సృజనాత్మకత పెరుగుతుందని, మనోవికాసం అభివృద్ధి చెందుతుందని పరిశోధనల ద్వారా నిరూపితమయ్యిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ ఒకప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానం-2020లో దేశం అంతటా మాతృభాషలకు ప్రాధాన్యత పెంచుతూఉంటే ఇక్కడ మాతృభాషకు మంగళం పాడేటట్లు పాలకులు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ఏభాషలో చదువుకోవాలన్నది విద్యార్థి ఇష్టమని తెలిపారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు భాషలో చదువుకోవడానికి అవకాశం లేకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

ఐదుగురికి ఏవోలుగా పదోన్నతులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఐదుగురికి ఏవోలు పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులను జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం అందజేశారు. డి.నరసింగరావును సంతబొమ్మాళి మండలపరిషత్ ఏవోగా, ఎన్.సోమశేఖర్ వంగర ఏవోగా, ఎ.మార్కండేయరావు రణస్థలం ఏవోగా, కె.ఉమామహేశ్వరరావు జడ్పీకార్యాలయం శ్రీకాకుళం ఏవోగా, జి.మధుసూదనరావు పొందూరు మండల పరిషత్ కార్యాలయం ఏవోగాను నియమించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డి.సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీలో సముచిత స్థానం

● స్థానిక ఎన్నికలకు సిద్ధంకావాలి
● జిల్లాలోని మినీ మహానాడులో నాయకుల పిలుపు

టీడీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన పదవులు ఇచ్చి పార్టీ సముచితస్థానం కల్పిస్తుందని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. మంగళవారం జిల్లాలోని ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల,శ్రీకాకుళం నియోజకవర్గాల మినీమహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. పహల్గాం దాడిలో మృతిచెందిన పౌరులు, వైసీపీ హయాంలో చేసిన దాడుల్లో చనిపోయిన కార్యకర్తలకు నివాళుర్పించారు. కాగా ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన పలు తీర్మానాలుచేశారు.

సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, మే20 (ఆంధ్రజ్యోతి):టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకువెళ్లాలని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు.మంగళవారం ఇచ్ఛాపురంలో మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ వల్ల రాష్ట్రం అధోగతి పాలయ్యిందని, ప్రతిపక్షం అన్న పదానికే అర్థం లేకుండాపోయిందన్నారు. ఎన్ని కుతంత్రాలు, కుట్రలు చేసినా కెరటంలా టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి తన సత్తా చాటిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగాచంద్రబాబునాయుడు తీసుకువెళ్తున్నారన్నారు. ఐదేళ్లలో దొంగకేసులు పెట్టిడంతోపాటు అక్రమ అరెస్టులుచేసి చిత్రహింసలు పెట్టిన జగన్‌కు ప్రజలుబుద్ధిచెప్పారన్నారు.రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారని ఆరోపించారు. నియోజకవర్గస్థాయిలో తీసుకొచ్చిన ఇరిగేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, బెంతుఒరియాలు, మత్స్యకార సమస్యలపై చేసిన తీర్మానాలను జిల్లాస్థాయిలో చర్చించి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అనంతరం పలు తీర్మానాలుచేశారు.కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు మొదలవలస రమేష్, కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీయాదవ్, పొందల కృష్ణారావు, లీలారాణి, దక్కత ఏకాంబరి, ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రియాశీలక కార్యకర్తలకు బీమా

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

పాత శ్రీకాకుళం, మే20(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కార్యకర్తలకు ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని 80 పీట్ రోడులో గల టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవం పెంచేలా పార్టీ పని చేస్తోందన్నారు. క్రియాశీలక కార్యకర్తకు ఐదు లక్షల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో, నియోజకవర్గ పరిశీలకుడు చింతల రామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చింతల రామకృష్ణ, నాయకులు మాదారపు వెంకటేష్, శీర రమణయ్య, విభూది సూరిబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, టి.వెంకన్నయాదవ్, చిట్టి మోహన్, ప్రధాన విజయరామ్, నియోజకవర్గ మహిళా నాయకురాలు స్వాతీశంకర్ పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తేనే పదవులు

● మినీ మహానాడులో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



లావేరు: మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

లావేరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన పదవులు ఇచ్చి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని బుడుమూరు సంతతోట ఆవరణలో లావేరు టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి మినీమహానాడు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే సిద్ధంకావాలన్నారు. విజయనగరం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున్ మాట్లాడుతూ టీడీపీలో యువతరానికి ప్రాధాన్యత ఇవ్వాలని, దీనికి ముందు తరం నాయకులు పోత్సహించాలని కోరారు.కాగా ఎచ్చెర్ల నియోజకవర్గం పార్టీ కార్యాలయం భవనం నిర్మాణానికి లావేరు మండల టీడీపీ అధ్యక్షుడు ప్రతిపాదించారు. దీనికి టీడీపీ నాయకుడు గాలివెంకటరెడ్డి ఎచ్చెర్ల సమీపంలోగల తనకు సొంతంగా ఉన్న పది సెంట్లు స్థలాన్ని ఉచితంగా ఇవ్వడానికి ముందుకువచ్చారు. అలాగే పార్టీ రణస్థలం మండలాధ్యక్షులు లంక శ్యామలరావు రూ.ఐదులక్షలు, పిసిని జగన్నాథం రూ. మూడు లక్షలు, కొన్ని హేమసుందర్, గొర్లె లక్ష్మణరావు, రౌతు శ్రీను లక్ష సప్పున విరాళాలుగా అందజేశారు. కాగా ఎ.శ్రీరాములును ఎచ్చెర్ల మీడియా సెల్ కమిటీ సభ్యుడిగా నియమించినట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలోఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ పార్టీ పరిశీలకులు అన్నెపు రామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాస్,నాయకులు చౌదరి నారాయణమూర్తి, లంక శ్యామలరావు, బెందు మల్లేష్, కుమరాపు రవికుమార్, తోటయ్యదొర, బానోజీనాయుడు, గాలి వెంకటరెడ్డి, జోగిరాజు మౌళి, మధుబాబు, డీజీఎం ఆనందరావు, లంక నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న అశోక్



పాత శ్రీకాకుళం: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

● కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అరసవల్లి, మే20(ఆంధ్రజ్యోతి):లేబర్‌కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలనాయకులు డిమాండ్‌చేశారు. జూలై తొమ్మిదో తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని డైమండ్‌పార్కువద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ట్రెజరర్ అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ప్రకాశరావు, మెడికల్ రిప్స్ ప్రధానకార్యదర్శి వాసుదేవరావు, మహేష్, పోస్టల్, కళాసీ, హమాలీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు, సూర్య, ఆదినారాయ ణమూర్తి, గోవర్ధనరావు, బి.చిన్నారావు, సింహాచలం, త్రినాథ్, ఎర్రయ్య, లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్వారీ నిర్వహణలో నిబంధనలు పాటించండి



క్వారీని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

ఎచ్చెర్ల, మే 20(ఆంధ్రజ్యోతి): క్వారీ నిర్వహణలో తప్పనిసరిగా నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ముద్దాడ, కొంగరాం పంచాయతీల్లోని క్వారీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకపోవడంతో ఈ రెండు క్వారీలు నిలిచిపోయాయని, ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అవసరమైన అన్ని నిబంధనలు పాటిస్తేనే అనుమతిస్తామన్నారు. క్వారీ విస్తీర్ణం, గతంలో ఏ మేరకు తవ్వకాలు జరిగాయి, ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశాలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ బి.గోపాల్, ఎస్ఐ ఎస్.సందీప్‌కుమార్ ఉన్నారు.

నేడు రణస్థలంలో జాబ్ మేళా

రణస్థలం, మే 20 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, 835 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడి గల్లంతు



సంతోష్ (ఫైల్)

రణస్థలం, మే 20 (ఆంధ్రజ్యోతి): నారువ గ్రామానికి చెందిన నిద్రబంగి సంతోష్ సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కథనం మేరకు.. సంతోష్, రమణ, సూర్యనారాయణ మంగళవారం దోనిపేట తీరంలో సముద్రస్నానానికివెళ్లారు. అయితే ముగ్గురుస్నానం చేస్తున్న సమయంలో పెద్ద కెరటం రావడంతో సంతోష్ గల్లంతయ్యాడు. సంతోషను కాపాడేందుకు రమణ, సూర్యనారాయణ ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారిద్దరూ ఒడ్డుకు చేరుకున్నారు. గల్లంతైన సంతోషకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో చెవిటమ్మ పండుగ



ఘటాలతో చెవిటమ్మ తల్లి గుడికి వెళుతున్న మహిళలు

గార మే 20(ఆంధ్రజ్యోతి): జొన్నలపాడు చెవిటమ్మతల్లిపండుగ మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మహిళలు ఘటాలను మేళ తాళాలతో ఆలయానికి వెళ్లి చల్లదనం చేశారు.

ఘనంగా హనుమాన్‌కు పూజలు

ఇచ్ఛాపురం, మే20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెల్లుపడకాలనీ సయ్యద్‌ఖాన్ చెరువు పక్కన గల తారకేశ్వరాలయంలో మూర్తి పంతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ ఆరాధన పీఠంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే వినాయక, శివపార్వతులు, సీతారామ లక్ష్మణులు, దుర్గామాత, హనుమాన్ చిత్రపటాలకు శాహస్రనామార్చనలు చేశారు.కార్యక్రమంలో డిల్లీ గురుస్వామి పాల్గొన్నారు.

కంచమ్మతల్లికి పసుపు నీటితో అభిషేకం

కంచిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): కంచిలి ప్రజల ఆరాధ్యదేవత శ్రీకంచమ్మతల్లి విగ్రహానికి గ్రామస్థులు మంగళవారం పసుపు నీళ్లతో అభిషేకం చేశారు. అమ్మవారి సంబరాలు జూన్ ఒకటో తేదీన ప్రారంభమై 10వ తేదీ వరకు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. సంబరాలనేపథ్యంలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచి కలశాలతో నీటిని తీసుకువచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకించారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్ -2025 మంగళవారం ప్రశాంతంగా జరిగిందిసోమవారం ప్రారంభమైన ఈపరీక్షలు 27వ తేదీ వరకు జరుగుతాయి. మొదటి రెండు రోజులు బైపీసీ స్ట్రీమ్‌లో అగ్రికల్చర్, ఫార్మసీలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహించారు. మంగళవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 560కు 511 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 341కు 328 మంది హాజరయ్యారు.

ఎంపీడీవోగా విశ్వేశ్వరరావు

కవిటి, మే 20(ఆంధ్రజ్యోతి): కవిటి ఎంపీడీవోగా వి.విశ్వేశ్వరరావు మంగళవారం బాధ్యత చేపట్టారు. ఆయన ఇప్పటి వరకూ లావేరు ఈవోపీఆర్డీగా (డిప్యూటీ ఎంపీడీవో)గా బాధ్యతలు నిర్వహించారు. మేరకు ఇక్కడకుపదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది విశ్వేశ్వరరావును కలిశారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను నమోదు చేయండి

కంచిలి, మే 20(ఆంధ్రజ్యోతి): సహిత ఉపాధ్యాయులు (ఐఈఆర్‌టీ) సర్వేలో గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లల సీడబ్ల్యూఎస్ఎన్ వివరాలను నమోదు చేయాలని ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు తెలిపారు. సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగంలో 2025-26 సంవత్సరానికి ప్రత్యేక అవసరాలగల పిల్లలకోసం ఈనెల 13నుంచి చేపట్టిన సర్వే జూన్ ఆరో తేదీ వరకూ కొనసాగుతుదని పేర్కొన్నారు. ఐఈఆర్‌పీలు గుర్తించిన సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల వివరాలు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ రిజిస్టర్‌లో నమోదుచేసి ఎంఈవోతో సంతకం చేయించాలని తెలిపారు. మండలంలోని క్లస్టర్లను రెండు విభాగాలుగా చేసి ఐఈఆర్‌టీలు సర్వే బాధ్యతలు తీసుకోవాలని చెప్పారు.

విద్యాకానుక కిట్లను పాఠశాలలకు చేర్చాలి

పొందూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేర్చాలని శ్రీకాకుళం ఉప విద్యా శాఖాధికారి ఆర్.విజయకుమారి కోరారు. మంగళవారం పొందూరులోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీచేసిన అనంతరం ఎస్ఆర్‌వీకేటీ స్టోర్‌లో స్కూల్ బ్యాగు నాణ్యతను పరిశీలించారు. ఆమెతోపాటు ఎంఈవో-2 పి. రాజారావు ఉన్నారు.

తెలుగోడి సత్తాను చాటిన వ్యక్తి ఎన్టీఆర్

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సత్తాను ప్రపంచానికి చాటిన వ్యక్తి టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. రాళ్లపాడు గ్రామ సమీపంలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నరసన్నపేట నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తర్వాత దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పార్టీని కేంద్ర స్థాయిలో ముందుకు నడిపించారన్నారు. తండ్రి ఆశయాలతో ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు చిన్న వయసులో కేంద్రమంత్రి స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, పార్టీ కోసం నిద్రాహారాలుమాని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కడపలో నిర్వహించనున్న మహా నాడుకు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజవర మినీ మహానాడు పరిశీలకుడు కోయిలడ వెంకటేశ్వరరావు, పార్టీ సమన్వయకర్త బగ్గు అర్చన, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టీడీపీ నేతలు ఎంవీనాయుడు, కేవీరమణ, డి.తేజ, జగదీశ్వరరావు, బీబీ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

వేడుకగా మినీ మహానాడు

నియోజకవర్గ స్థాయి టీడీపీ మినీ మహానాడు వేడుకలు మంగళవారం సందడిగా నిర్వహించారు. నరసన్నపేట, పాతపట్నం, పలాస నియోజకవర్గాల్లోని పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పలాసలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పార్టీ పతాకాలను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున క్యాడర్ పాల్గొంది.

టీడీపీ హయాంలోనే సంస్కరణలు

● మాజీ మంత్రి శివాజీ

పలాస, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో తక్కువ కాలంలో అధికారంలోకి వచ్చి టీడీపీ ఘనకీర్తి పొందిందని, టీడీపీ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంస్కరణలు వచ్చాయని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. పార్టీ వ్యవస్థాపకుడిగా దివంగత సీఎం ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో ఉంటా రన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పలాస నియోజక వర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కిలో బియ్యం రూ.2, కూడు, గుడ్డ, గూడు అన్ని వర్గాల ప్రజలకు అందాలన్నదే ఎన్టీఆర్ ఆశయమని, అదే మార్గంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. కష్ట కాలంలో వెన్నంటే ఉన్న కార్యకర్తల రుణాన్ని తీర్చుకుంటామని, భవి ష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసి నియోజకవర్గాన్ని ప్రథ మ స్థానంలో ఉంచుదామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీషలను అభినందిస్తూ తీర్మానం ఆమోదించారు. 11 అంశాలపై తీర్మానం చేశారు. పహల్గాం మృతులు, ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్‌లకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, నేతలు వీరుకట్ల విఠల్‌రావు, సూరాడ మోహనరావు, బడ్డ నాగరాజు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, శాసనపురి మురళీకృష్ణ, ఎం.నరేంద్ర (చిన్ని), యవ్వారి మోహనరావు, డిక్కల ఆనంద్, తమ్మినాన గంగారామ్, దడియాల నర్సింహులు, నియోజక వర్గంలోని నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ

క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ

● ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): పాలన సంస్కరణలకు, సంక్షేమానికి శ్రీకారం చుట్టి పార్టీలకు మార్గదర్శకంగా టీడీపీ నిలిచిందని, క్రమశిక్షణ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం పాత పట్నంలో మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన ఘనత దివంగత సీఎం, పార్టీ వ్యవస్థాప కుడు ఎన్టీఆర్‌కు దక్కింద న్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.650 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహా నికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలు అంశాలపై తీర్మానం చేశారు. టీడీపీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మృతి చెందితే మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ. 50 వేలు బీమా సౌకర్యాన్ని వ్యక్తిగతంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నియోజక వర్గంలోని ఐదు మండలాల ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

అమ్మవారి పండుగలకు వెళ్లి తిరిగి వస్తూ..

● డివైడర్‌ను ఢీకొని ఆర్మీ జవాన్ మృతి

● మృతుడు నందిగాం మండలం పెంటూరు వాసి

● అన్న కుమార్తె వివాహానికి సెలవుపై వచ్చి దుర్మరణం

నరసన్నపేట/నందిగాం, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జరుగుతున్న అమ్మవారి పండుగలకు వెళ్లి తిరిగి వస్తూ ఆర్మీ జవాన్ మృత్యువాత పడిన ఘటన సత్యవరం ఫ్లై ఓవర్‌పై మంగళవారం సంభవించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నందిగాం మండలం పెంటూరుకు చెందిన అసోం రైఫిల్ ఫోర్స్‌లో జవాన్‌గా పనిచేస్తున్న పిన్నింటి దొరబాబు శ్రీకాకుళంలో జరుగుతున్న అసిరితల్లి పండుగలకు బంధువుల ఇంటికి తన మామయ్య నందిగాంకు చెందిన సనపల సీతారామయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి స్వగ్రామం వస్తూ సత్యవరం ఫ్లై ఓవర్‌కు వచ్చే సరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దొరబాబు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, మామ సీతారాంకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రుడిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఘటన ప్రాంతానికి ఎస్ఐ దుర్గాప్రసాద్ వెళ్లి పరిశీలించారు. మృతుడు దొరబాబు తన అన్న కుమార్తె వివాహం కోసం వారం కిందట సెలవుపై ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో బంధువులు ఇంటికి పండుగలకు వెళ్లి తిరిగి వస్తూ దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు గగ్గోలు పెడుతున్నారు. భార్య కాంచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. ఆర్మీ జవాన్‌గా సుమారు 15 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడు గంజాం జిల్లా వాసి

నరసన్నపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కోమర్తి గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి రంజిత్‌కుమార్ కబీ(30) నిర్ధారించారు. గాయపడిన వక్తి రాజేంద్ర బిశ్వాల్‌కిండు పడార్. వీరు స్వగ్రామం నుంచి విశాఖపట్నం ద్విచక్రవాహనంపై వెళుతూ డివైడర్ ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

అసిరిపోలమ్మ గుడిలో చోరీ

ఎచ్చెర్ల, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాడలో గల అసిరి పోలమ్మ తల్లి గుడిలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముద్దాడ నుంచి రుప్పపేట వెళ్లే రోడ్డులోని అసిరి పోలమ్మ గుడి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. కిలోన్నర వెండి, తులం బంగారంతో పాటు హుండీలోని సుమారు రూ.15 వేలను దొంగలు ఎత్తుకుపోయారు. గ్రామానికి చెందిన బి.రామారావు మంగళవారం ఉదయం అమ్మవారి దర్శనానికి వెళ్లగా.. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదు మద్యం సీసాలు స్వాధీనం

ఇచ్ఛాపురం, మే20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో ఐదు మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం సిబ్బంది లక్ష్మణ్, సూర్యారావుకు సమాచారం రావడంతో ఇచ్ఛాపురంలోని అయ్యప్ప ఆలయం సమీపంలో తనిఖీ చేశారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఒడిశాకు చెందిన 48 బీర్, ఐదు మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న కర్రి షణ్ముఖరావు, నర్తు మోహన్‌రావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

● నిందితుడిది శ్రీకాకుళం జిల్లా దీపావళి గ్రామం

విజయనగరం క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): విజయనగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన పోక్సో కేసులో శ్రీకాకుళం జిల్లా గార మండలం దీపావళి గ్రామానికి చెందిన ఉప్పెనవలస ఉమామహేశ్వరరావుకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి మంగళవారం తీర్పు వెల్లడించారని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నగరంలో నివాసం ఉంటున్న 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతున్న సమయంలో ఉమామహేశ్వరరావుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడేవాడు. ప్రేమిస్తున్నానని నమ్మబలికి ఆమెను శ్రీకాకుళం తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. సదరు బాలిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ లక్ష్మణరావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ బి.నాగేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. ఉమామహేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి తీర్పు ఇచ్చారని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

పిడుగులపై అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): పిడుగుపాట్లపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరావు అన్నారు. కొరసవాడ గ్రామంలో మంగళవారం గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన కలిగించారు. పశువైద్యాధికారి పి.అనిల్ పాల్గొన్నారు.

అధ్వానం.. అంజనాపురం రోడ్డు



బురదతో నిండిన అంజనాపురం రహదారి

టెక్కలి, మే 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ అంజనాపురం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ఉన్న సోమవారం కురిసిన వర్షానికి గోతుల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ మార్గంలో అంజనా పురం, నవరగోపాలపురం, నువ్వు గుడ్డి, కేదారి ప్రజల నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఉండి కూడా రోడ్డు దారుణంగా ఉండడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గోతులమయంగా శివరాంపురం రహదారి

నందిగాం, మే 20(ఆంధ్రజ్యోతి): పెంటూరు నుంచి సైలాడ వయా శివరాంపురం రహదారి గోతులమయమై వాహన చోదకులు, పాద చారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మంగళవారం పడిన వర్షంతో గోతుల్లో నీరు చేరింది. దీంతో రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో వాహన దారులు ఇక్కట్లకు గురయ్యారు. ఇదే మార్గంలో రౌతుపురం రైల్వే హాల్ట్ ఉండడంతో తెల్లవారు జామున, రాత్రి వేళల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు దారుణంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రహదారి గోతుల్లో నిలిచిన వర్షం నీరు

సకాలంలో రీ సర్వే పూర్తి చేయాలి

● సర్వే శాఖ డీడీ డీఎల్‌డీఎల్ కుమార్

నరసన్నపేట, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేను సమర్థవంతంగా ఎటువంటి తగదాలకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సర్వే, భూసేకరణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీఎల్‌డీఎల్ కుమార్ అన్నారు. నడగాంలో చేపడుతున్న రీ సర్వేను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పల స్వామి, రీ సర్వే డీటీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: సిబ్బందికి సూచనలిస్తున్న సర్వే విభాగం డీడీ డీఎల్‌డీఎల్ కుమార్

పారదర్శకంగా చేపట్టండి

జలుమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా రీ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని రీసర్వే డిప్యూటీ డైరెక్టర్ డీఎల్‌బీఎల్ కుమార్ అన్నారు. తలతరియా రెవెన్యూ గ్రామంలో రీ సర్వేని మంగళవారం పరిశీలించారు. అనంతరం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, రీ సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూములను రీ సర్వే చేసినప్పుడు సంబంధిత రైతులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వ పోరంబోకు, చెరువులు, గోర్జిపోరంబోకులు, గ్రామకంఠాలను రీ సర్వేలో గుర్తించి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జన్ని రామారావు, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, రీ సర్వే డీటీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో తిరంగా యాత్ర

కొత్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌లోని ఉగ్రమూకలను మట్టుబెట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మంగళవారం కొత్తూరులో తిరంగా యాత్ర చేపట్టారు. ఉగ్రమూకల స్థావరాలను ఛిన్నాభిన్నం చేసిన ఇండియన్ ఆర్మీ ధైర్య సాహసాలను ప్రశంసిస్తూ వివిధ రాజకీయ పార్టీల నేతలు, మాజీ సైనికులు ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీలో జయహో భారత్, వందేమాతరం అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన, వైఎస్ఆర్ సీపీ పార్టీల నేతలు ఎల్.తులసీవరప్రసాదరావు, వలురౌతు ప్రసాదరావు, బూరాడ భాస్కరావు, పడాల వెంకట కృష్ణ, మాజీ సైనికులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి



కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న ఈడీ గడ్డెమ్మ

హిరమండలం, మే 20(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి పొందాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న మంచి అవకాశమన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాదరావు తదిత రులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం

పలాసరూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి ఊరిస్తున్న వరుణుడు మంగళవారం కరుణించాడు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురియడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఖరీఫ్‌కు భూములను దున్నేందుకు సిద్ధం చేస్తు న్నారు. ఇటువంటి వర్షాలు ఈ వారంలో కురిస్తే నీటి సమస్య తీరుతుందని పేర్కొంటున్నారు.



పలాస మండలంలో కురుస్తున్న వర్షం

నందిగాంలో భారీ వర్షం

నందిగాం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు అర గంటపాటు పడిన వర్షంతో పొలాల్లో నీరు చేరింది. గడచిన కొన్ని రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండగా ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది.

రోడ్డుపై నీటి ప్రవాహం

పోలాకి, మే 20(ఆంధ్రజ్యోతి): పోలాకి మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై వర్షపునీరు ప్రవహించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీర్ఘాశిలోని నూకవీధిలో రోడ్డుపై నీరు చేరింది. సీసీ రోడ్డు అయినప్పటికీ పల్లపు ప్రాంతం కావడంతో ఎగువ నుంచి వర్షపు నీరు ఈ వీధి లో నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతు న్నామని స్థానికులు పేర్కొన్నారు.



నూకవీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

న్యూస్ బాక్స్

కలమటను కలిసిన చౌదరి

కొత్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తిని డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన చౌదరి అవినాష్ మంగళవారం మాతలలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కలమట సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నందిగాం, మే 20(ఆంధ్రజ్యోతి): నవర రామకృష్ణాపురంలోని కాశీవిశ్వేశ్వరాలయం 8వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నపూర్ణ దేవి సమేత కాశీవిశ్వేశ్వరుని కల్యాణం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం చేపట్టారు. పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులను సరిచేసుకోండి

వజ్రపుకొత్తూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఆధార్ నెంబరు తప్పుగా నమోదైతే సరిచేసుకోవాలని డీటీ బి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం సచివాలయంలో సరిచేసిన తరువాత తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆ తరువాత వీటిని జేసీ లాగిన్‌కు పంపి పూర్తి స్థాయిలో సరి చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన ర్యాలీ వాయిదా

టెక్కలి, మే 20(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో ఈనెల 21న తలపెట్టిన దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన ర్యాలీ అకాల వర్షాలు, తీవ్రమైన ఎండలు కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు తెలి పారు. బైదాలాపురం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.సత్య వాణిపై కొరసవాడకి చెందిన రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ సదా శివ కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతూ మానసికంగా ఇబ్బంది పెట్టారన్నారు. ఈ చర్యలకు నిరసనగా ఆత్మగౌరవ ర్యాలీ చేపట్టాల్సి ఉందని, అయితే అకాల వర్షాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. డా.సదాశివపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

జలుమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.సుధారాణి అన్నారు. లింగాలవలస, జలుమూరు రేషన్ డిపోలను మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న సరుకులు, రికార్డులో నమోదైన నిల్వలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలిం చారు. కార్డుదారుకు సరుకులు తరుగుదల లేకుండా అందించాలన్నారు. మండల గోడౌన్ నుంచి నిత్యావసర సరుకులు తెచ్చినపుడు తూకం వేయించి తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు వీఆర్వోలు రాము, అర్జునరావు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కాశీబుగ్గ, మే 20(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి డిమాండ్ చేశారు. మంగళవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతు సంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, అసంఘటితరంగ కార్మికులకు భద్రత చట్టం అమలు చేయాలని కోరారు. అఖిల భారత సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడిందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు దుష్యంత్, అజయ్‌కుమార్, రాజు, సురేష్, లోకనాథం, నాగేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మందస, మే 20(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేసి అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కార్మిక సంఘా లు డిమాండ్ చేశాయి. మందస పట్టణంలో మంగళవారం కార్మిక సంఘాల ప్రతి నిధుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ.. కార్మిక, రైతు, ప్రజా వ్యతి రేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని కోరారు. దేశంలోని పరిస్థితుల దృష్ట్యా సమ్మె జూలై 9కి వాయిదా పడిందని, దానిని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు కె.బాలకృష్ణ, బి.మల్లేసు, బి.దుర్యోధన, పి.కూర్మారావు, ఏకాశి, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఐఐటీ లక్ష్యంగా ముందుకు సాగుతా: కంచరాన జ్యోషిత

● మంత్రి నారా లోకేశ్ నుంచి పతకం స్వీకరణ



హరిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలో చేరడమే తన లక్ష్యమని ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన కంచరాన జ్యోషిత (597/600) తన మనోగతాన్ని తెలియజేసింది. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులను సత్కరించారు. వీరిలో మందస మండలం మఖరజోల గ్రామానికి చెందిన కంచరాన జ్యోషిత ఒకరు. నారా లోకేశ్ ఆమెకు మెడల్‌తో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు. మంత్రి లోకేశ్ ద్వారా పతకాన్ని అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేసింది. తన కష్టానికి హరిపురం హైస్కూల్ ఉపాధ్యాయుల ప్రణాళికాపరమైన బోధన, మెలకువలు తోడయ్యాయని తెలిపింది. తన తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులని.. తనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం గర్వంగా ఉందని చెప్పింది.